ఓంశ్రీసాయిరాం

# దైవవిశ్వాసం, దేశాభిమానం పెంచుకోవాలి

ఈనాడు మన ఎం.బి.ఎ. విద్యార్థులు తమ బిజినెస్ మేనేజిమెంటు విభాగముయొక్క వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అసలు 'బిజినెస్' అంటే ఏమిటి? ఒక వస్తువిచ్చి మరొక వస్తువును తీసుకోటమా? కాదు. ప్రపంచమంతా జరుగుతున్నది బిజినెస్సే. ప్రైమినిష్టరు మొదలుకొని పనివానివరకు ప్రతి ఒక్కరూ చేసేది బిజినెస్సే. ఎవరికి తగిన పద్ధతిని వారు చక్కగా అనుసరిస్తున్నారు. మానవునికి గల ఐదు ఇంద్రియములను నిరంతరం బిజినెస్ చేస్తూనే వున్నాయి. ఏఏ అంగములకు సంబంధించినటువంటి బిజినెస్ ఆయా అంగములకు తు.చ. తప్పక అనుసరిస్తున్నాయి. ఎవరైతే తమ పంచేంద్రియములను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి వాటిని సరైనరీతిగా అనుభవిస్తారో వారే ప్రథమ శ్రేణికి చెందినవారు.

*దేశాన్ని, సంస్కృతిని దృష్టిలో పెట్టుకోవాలి*

కేవలం గ్రంథములు పఠించి, పేపర్లు చదివి, విదేశములయొక్క వ్యాపార పద్ధతులను గుర్తించి, మన భారతదేశములో జరిగే వ్యాపారములను వాటితో పోల్చుకుంటూ చేసే బిజినెస్ సరైన బిజినెస్ కాదు. మన ఇండియన్ బిజినెస్ భారతీయ సంస్కృతికి, విలువలకు కట్టుబడి వుండాలి. మనము విదేశీయులతో యేమాత్రమూ పోల్చుకోకూడదు. మన దేశముయొక్క స్థితిగతులను మనము దృష్టిలో పెట్టుకోవాలి. ఇతర దేశస్థులు మతయొక్క పవర్‌ను అభివృద్ధిపరచుకొనే నిమిత్తమై అనేకరకములైన మార్పులు చేస్తున్నారు. కాని, మనము ఆవిధమైన అనుకరణకు పూనుకోకూడదు. మన భావములకు, మన చర్యలకు, మన కుల పద్ధతులకు, మన ఆచారములకు తగినవి మనము నేర్చుకోవాలి. డబ్బును మాత్రమే దృష్టిలో పెట్టుకుంటే ప్రయోజనము లేదు. సంస్కృతిని కూడా చూడాలి. సంస్కృతితోబాటు దేశాన్నికూడా దృష్టిలో పెట్టుకోవాలి.

సంస్కృతి అంటే ఏమిటి? మన ప్రాచీనులయొక్క పద్ధతిని, మన భారతీయులయొక్క సంప్రదాయములను చక్కగా గుర్తించి వర్తించటమే. *బిజినెస్ విషయాల్లో మన సంస్కృతి మనం ఏమాత్రమూ వదలటానికి వీలులేదు.* culture and country, *ఈ రెండింటికీ తగినట్లుగా వర్తించటమే నిజమైన మానవత్వము. అయితే, కల్చర్ అనేది అభ్యాసము చేత, లేక సంబంధ బాంధవ్యముల చేత ఏర్పడేది* కాదు. 'ఇది మంచి, ఇది చెడ్డ' అనే విచారణను బట్టి, విచక్షణను బట్టి, మన హృదయమునుంచియే సంస్కృతి ఏర్పడుతుంది. కాని, అటువంటి విచక్షణ లేకపోవటం చేత ఈనాడు కల్చర్ పాడైపోతున్నది. కల్చర్ పాడైపోవటం వలన దేశము చాలా బలహీనమైపోతున్నది.దేశము బలహీనము కావటానికి కారణం ప్రజలు తమ సంస్కృతిని తాము సక్రమంగా అనుసరించక పోవటమే. మీకు తెలుసు, ఈనాడు ఒక్కొక్క పార్టీవారు ఒక్కొక్క సంస్కృతిని, ఒక్కొక్క భావమును అనుసరిస్తూ వస్తున్నారు. అందరూ కలసి సమైక్యంగా పని చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

*విద్యార్థి దశలో పాయల ద్వారా ప్రజల్లో మార్పు తెప్పిస్తూ వచ్చాను*

ఈ దేహం విద్యార్థి దశలో వుండగా ఒకనాడు బుక్కపచ్చం నుండి ఒక రాజకీయ నాయకుడు వచ్చి, 'బాబూ! నీవు మంచి కవిత్వం వ్రాస్తావుట. మన వీరులను ఉత్తేజపరచే విధంగా ఒక పాట వ్రాయాలి' అని కోరాడు. వాళ్ళు బుక్కపట్నంలో ఒక సభ ఏర్పాటుచేసుకున్నారు. అవి రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. భారతదేశం బ్రిటీషువారి పరిపాలనలో వుంది. ఆనాటి పరిస్థితికి తగినట్లుగా నేనొక పాట వ్రాసాను. స్టేజిపైన ఉయ్యాల తొట్టిలో ఒక రబ్బరుబొమ్మ పెట్టి ఊపుతూ ఆ పాట పాడాను.

> ఏడవకు పసిబాల ఏడవకు తండ్రీ! ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా...జో...జో...
> హంతకుడు హిట్లరు అమర రష్యాపై దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా....జో...జో..
> హిట్లరును చంపుటకు ఏఱ్ఱసైన్యంబు వీరుడౌ స్టాలిను కలరు ఏడ్వకు...జో...జో...
> ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు? ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా
> ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి స్వాతంత్ర్యమును పొందగలరు ఏడువకు జో...జో...

ఆరోజుల్లో నేను ప్రజలలో ఫ్యాషన్లపై మోజు పోగొట్టి పవిత్రమైన భావాలు పెంపొందే విధంగా పాటలు వ్రాసేవాడిని. గ్రామంలో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో కనిపెట్టి, తగిన పాటలు వ్రాసి, వారిల్ల ముందర పిల్లలచేత పాడించి వారికి బుద్ధి వచ్చేలా చేశాను. అప్పటిలో చేతికి గడియారం పెట్టుకోటం పల్లెలలో ఒక గొప్ప ఫ్యాషనుగా భావించేవారు. అంతేకాకుండా, 'హిట్లరు మీసీల'ని ముక్కు క్రింద పిదుదుల మాదిరి పెట్టుకొనేవారు. అటువంటి వారికి బుద్ధి చెప్పటానికి ఇలా వ్రాసాను.

> ఎడమ చేతి కడాన ఏందో తెల్లెల బిళ్ళ తోలు పట్టెడ గట్టి యాలాడగడతారు
> ఏటి యేషాలప్ప ఇవి? కంటితో చూచేకి కాని అవతారాలు, ఏటి యేషాలప్ప ఇవి
> పొదుగాటి మాసాలు గొరిగి కత్రించి నాసికముల్ దగ్గ నాల్గుంచుకుంటారు, ఏటి యేషాలప్ప ఇవి.

'ఏమిటి నాయనా! ఈ వేషం? ముక్కుక్రింద ఈగలు వ్రాలినట్లు కనిపిస్తున్నది. ఇది మంచిది కాదు' అని వాళ్ళకు నచ్చచెప్పాను. ఈ

ఫ్యాషన్లు అప్పటికప్పుడు వచ్చినవి కావు. ఒకరిని చూచి ఒకరు అనుకరిస్తూ వచ్చారు. ఇంక, ఆడవారు మంగళకరమైన పసుపు కుంకుమలు మానివేసి, కనిపించికనిపించనట్లుగా చిన్న చుక్క పెట్టుకోటం ప్రారంభించారు. అయితే, ఈ ఫ్యాషన్లు ఎంతకాలం వచ్చాయి? కొంతకాలమే! పిల్లలు, పెద్దలుకూడా మూడుమూడు దినాలకు ఈ ఫ్యాషన్లు మార్చుకుంటూ వచ్చారు. మీకందరికీ తెలుసు. మగపిల్లలు మొట్టమొదట బెల్‌బోటమ్ ప్యాంట్లు వేసేవారు. అది పైభాగంలో టైట్‌గాను, క్రింద చూస్తే లూజ్‌గాను వుంటుంది. ఆ ఫ్యాషన్ కొద్ది దినాలు నడిచింది. ఆ తరువాత ఒంటికి అంటుకొనిపోయి పైపుల మాదిరి కనిపించే 'టైట్‌ఫాంట్సు' వాడుకలోకి వచ్చాయి. ఆ తరువాత క్రమక్రమేణా 'ఇవేవీ మంచివి కావ'ని గుర్తించి సాధారణమైన డ్రస్సులు వేస్తూ వచ్చారు. ఈవిధంగా, ఫ్యాషన్లపై మోజుతో జనులు మధ్యమధ్యలో అనవసరమైన వేషాలు వేస్తుంటారు. ఇవన్నీ కదలిపోయే మేఘాలవంటివి. మనిషి మనిషిగా బ్రతకటం నేర్చుకోవాలి.

ఈనాడు మనము భుజించే ఆహారములోగానీ, ఉపయోగించే వస్తువులలోగానీ అనేకరకములుగా మార్పులు రావటం వల్ల అనేక రోగాలు ప్రారంభమవుతున్నాయి. పూర్వం మట్టితో తయారుచేసిన కుండలు, తట్టలు, చెంబులు ఇలాంటివన్నీ వుపయోగించేవారు. కాని, కొంతకాలం తరువాత వాటి స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీలు వస్తువులు వాడుకలోకి వచ్చాయి. ఇప్పుడు ప్లాస్టిక్ బ్యాగ్స్, ప్లాస్టిక్ వస్తువులు వుపయోగిస్తున్నారు. ఇవి ఎక్కడ ఏ భూమిలో వేసినా ఎన్ని సంవత్సరములైనా అట్లనే వుంటాయి దానివల్ల భూములు పాడైపోతున్నాయి. అటువంటి భూముల్లో పండించిన కూరగాయలు మనిషి ఆరోగ్యానికి హానికరంగా పరిణమిస్తున్నాయి.

*సత్యసాయి విద్యావిధానం వలనే అభివృద్ధి సాధ్యం*

ఈనాడు ప్రభుత్వంవారు విద్యారంగంలో కూడా అనేక మార్పులు చేస్తున్నారు. ఎన్నైనా మార్చవచ్చు. కాని, దానికి తగినటువంటి టీచర్లను తయారుచేస్తున్నారా? లేదు. టీచర్లు లేనప్పుడు పిల్లలు ఏవిధంగా నేర్చుకుంటారు? మొట్టమొట క్వాలిఫైడ్ టీచర్లు కావాలి. అలాంటి టీచర్లను తయారుచేయటానికి మన యూనివర్సిటీలో అనేకవిధములైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీచరు మంచిగా వుంటేనే పిల్లలు మంచివారౌతారు. పిల్లల మంచిచెడ్డలు టీచర్లపైన ఆధారపడి వుంటాయి.

మన విద్యావిధానంలో ఎట్టి మార్పులూ, ఎట్టి అనుకరణలు చేయకూడదు. మన పద్ధతిని మనం అనుసరిస్తే వర్తమానంలో అనుభవిస్తున్న ఆనందమునే భవిష్యత్తులోకూడా అనుభవించవచ్చు. ఈనాడు అనేకమంది భవిష్యత్తుకోసం ఏవేవో ప్లాన్లు వేస్తున్నారు. భవిష్యత్తు వర్తమానముపై ఆధారపడివుంది. Don't brood over the past, don't worry about future. Past is past, forget the past.. present ప్రదానమైనది. భూతభవిష్యత్కాలములు రెండూ వర్తమానములో యిమిడి వున్నాయి. ఇది ఆర్డినరీ ప్రజంట్ కాదు. ఆమ్నీప్రజంట్. దీనిని మనం సద్వినియేగం చేసుకోవాలి. ఈ వర్తమానములో సరైన పద్ధతిని అనుసరించేది ఒక్క సత్యసాయి కాలేజి తప్ప మరొకటి లేదు. చూచుటకు ఇది పల్లె జీవితంగా కనిపించవచ్చు. కాని, దీనివల్ల భవిష్యత్తులో మీకు ఎంతగానో అభివృద్ధి కలుగుతుంది. కాబట్టి, మీరు సత్యసాయి విద్యావిధానమును ఏమాత్రం మార్చకండి.

చాలామంది గతాన్ని గురించి, భవిష్యత్తు గురించి చింతిస్తూ వర్తమాన జీవితంలో భ్రష్టుపట్టిపోతున్నారు. భవిష్యత్తును గురించి చింతించటంలో మనకు సుఖము లేదు. 'గతం గతః' అందులో ఎంతవరకు సుఖపడ్డారు? కాబట్టి, వర్తమానంలో మీరు ఆనందంగా వుండండి. ధనము పోతే నష్టము లేదు. కాని, గుణమును కాపాడుకోవాలి. సద్గుణములను అలవర్చుకున్నప్పుడే మీ మైండ్ నిశ్చలంగా వుంటుంది. అదే చాలా ఉత్తమమైన మైండ్. మనస్సు వల్లనే మనిషి చాలా మార్పుచెందుతూ వస్తాడు. తల్లిదండ్రులు కూడను వర్తమానమును సద్వినియోగం చేసుకోమని తమ పిల్లలకు బోధించటం లేదు. ఇంక ఎన్ని చేసి ప్రయోజనం ఏమిటి? మన పిల్లలు మాత్రం 'ప్రెజంట్'ను సద్వినియోగపరచుకొని ఎన్నోవిధాలుగా అభివృద్ధిపొందుతున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ వర్తమానంలో మనం చేయవలసింది ఏమిటి? కోరికలను తగ్గించుకోవాలి. Less luggage more comfort make travel a pleasure. గతాన్ని గురించి చింతించకూడదు. అది మనకు ఏమాత్రం ఉపకారం చేయదు. వర్తమానములో మన జీవితాన్ని అన్నివిధాలా అభివృద్ధిపరచుకోవాలి. ఈ 'ప్రెజంట్' అనేది ఎంత గొప్ప పదమో మీరు యోచన చేసుకోండి. 'ప్రెజంట్' అంటే ఏమిటి? 'క్లాసులో ఉన్నాడు' అని అర్థము. క్లాసులో లేనివాడు ఆబ్సెంటు'. అది విలువ తగ్గిస్తుంది. ప్రతి ఒక్క విషయంలోనూ 'ప్రెజంట్' అనేది మంచిది. కనుక, మీరందరూ 'ప్రెంజట్'ను దృష్టిలో పెట్టుకోండి. ఈనాటి పెద్దలు, 'అయ్యో! మా పూర్వకాలం ఎంతో బాగుండేది. ఇప్పుడు అంతా చెడిపోయింది.ష అని అనుకుంటారు. నిజమే!ఆనాడు పిల్లవీ పెద్దలను గౌరవించేవారు. వారితో ఎంతో మర్యాదగా ప్రవర్తించేవారు. వారినుండి హితోపదేశములను అందుకొనేవారు. అసలు టీచర్ల వరకు వెళ్ళే అవసరం వుండేది కాదు. ఇంట్లోనే 'గ్రాండ్‌మదర్స్' పిల్లలకు ఎంతో మంచి విషయాలను బోధించేవారు. అందరూ ఎంతో ఆనందంగా వుండేవారు. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అన్నట్లు పాతవారే బంగారంలాంటివారు. వారెంతో ఉత్తమమైన మార్గమును బోధించినటువంటివారు. ఇట్టి పవిత్రమైన మార్గమును ఈనాడు మనము చెడగొట్టుకోకుండా చూచుకోవాలి.

మొట్టమొదట కోపము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణములను దూరం చేసుకోవాలి. అప్పుడే మనము 'యూనిటీ' ద్వారా ఎంతో సాధించవచ్చు. ఇప్పుడు లోకములో ఎక్కడ చూచినా కలహములే! ఎవరిని చూచినా కోపమే! ఎవరితో మాట్లాడినా విరుద్ధమే! ఎక్కడ చూచినా ... 'నో యూనిటీ' 'నో ప్యూరిటీ' అంతా 'ఎనిమిటీ'. అందుచేతనే ఆనాడు సుభాష్‌చంద్రబోస్ దేశాన్ని వదలి బయటికి

వెళ్ళవలసి వచ్చింది. 'ఎనిమిటీ' ఎప్పుడు వస్తుంది? స్వార్థము వచ్చినప్పుడే 'ఎనిమిటీ' వస్తుంధి. అయితే, అతను ఎక్కడికి వెళ్ళినప్పటికీ ప్రజలకు చేయవలసినటువంటి సేవను చక్కగా, నిర్భయంగా చేస్తూ వచ్చాడు. అటువంటి మంచివారు మన దేశానికి ఎంతో అవసరం. మన టీచర్లు నా దగ్గరకు వచ్చి, 'స్వామీ! మన యూనివర్సిటీలో మంచిమంచి పిల్లలున్నారు. క్లాసులో మంచి మార్కులు తెచ్చుకునే పిల్లలున్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన పిల్లలను వాళ్ళ తల్లిదండ్రులు విదేశాలకు పంపుతున్నారే!' అని బాధపడ్డారు. ఎందుకు పంపాలి? వాళ్ళను మన దేశమునందే పెట్టుకొని దేశ ప్రజలను సరైనరీతిగా తీర్చిదిద్దవచ్చును కదా! విదేశాలలో నెలకు పదివేల రూపాయలు సంపాదించే బదులు మన దేశములో వెయ్యి రూపాయలు సంపాదించినా చాలు. విదేశాల్లో సంపాదించే డబ్బులో అర్థ భాగము ఇంటి అద్దెకే సరిపోతుంది. మిగిలినవాటి వెలకూడా చాలా ఎక్కువ. మంచినీరు దొరకటం చాలా కష్టం. ప్రతిదానికీ విదేశాల్లో కష్టమే! ఒక అరటిపండు కొనాలంటే, పది రూపాయలు. ఎక్కడనుంచి తెచ్చి పెడతావు ఇవన్నీ? బిడ్డలను ఏవిధంగా సాకుతావు? సాధ్యం కాదు. మన ఇంటిలో యింత అన్నం వండి పచ్చడి వేసి పెట్టినా అది తిని పిల్లలు ఎంతో తృప్తిగా వుంటారు. ఇట్టి సులభంగా వున్న జీవితాన్ని విడిచిపెట్టి మీరు కష్టానికి ఓర్చుకొని విదేశాలకు వెళ్ళాలని ఆశిస్తున్నారు.

తీంతకాలమైనా నేను ఎక్కడా విదేశాలకు పోలేదు. ఐతే, ఒక్కసారి తూర్పు ఆఫ్రికాకు మాత్రం వెళ్ళినాను. అక్కడ నేను అడవిలో మృగాలను చూచుకుంటూ, వాటికున్న గొప్ప గుణములను గమనిస్తూ వచ్చాను. అక్కడ ఏనుగులున్నాయి. ఎంత గొప్పగా వున్నాయి! ఎంత అందంగా వున్నాయి! వాటి చెవులు పెద్ద చేటల మాదిరి వున్నాయి. అవి ఒక్క తూరి చెవులు అల్లాడిస్తే ఎంతో దూరంలో వున్న దోమలుకూడా ఎగిరిపోతాయి. నేను ఆ ఏనుగుల దగ్గరకు వెళ్ళి పండ్లు ఇచ్చాను. అవి ఆనందంగా అందుకున్నాయి. ఇంక జీబ్రాలున్నాయి. జిరాఫీలున్నాయి. ఎంత ఆనందంగా ఉన్నాయో! ఆ అడవిలో వున్న మృగాల్లో ఏవికూడను మానవుని బాధించేవి కావు. ఈనాటి మానవునియొక్క దుర్గుణములే ఈ పశుపక్షిమృగాదులలో మార్పు తెస్తున్నాయి. వాటికి మనమేమైనా హాని తలపెడితే అవి మనకు హాని చేస్తాయిగాని, మనమేమీ చేయకపోతే అవి పెంపుడు జంతువుల మాదిరి మనవెంట వస్తాయి. ఆ అడవిలో ఒకచోట కొన్ని సింహములు, వాటి పిల్లలు కూర్చున్నాయి. మమ్మల్ని ఆనందంగా చూస్తూ అక్కడే కూర్చున్నాయి. ఆవిధంగా క్రూరమృగాలు కూడా ఎంతో మంచిగా ప్రవర్తించాయి. ?యద్భావం తద్భవతి' మన భావములను పురస్కరించుకొనియే అవి ఆవిధంగా ప్రవర్తిస్తాయి. పాములు కూడా అంతే. మన ప్రక్కలోనే వచ్చి పడుకుంటాయి కానీ యేమీ చేయవు. తరువాత వాటి పాటికి అని వెళ్ళిపోతాయి. కాని, మన భావములలో దోషం వుంటే మనం ఎంతో ప్రేమతో పెంచినటువంటి ఆవుకూడను మనల్ని పొడిచేందుకు వస్తుంది. ఒక వ్యక్తి నీపైన కోపంగా వున్నాడంటే, కారణమేమిటి? అది నీ భావములయొక్క రియాక్షన్, రీసౌండ్, రిఫ్లక్షన్.

ఈనాడు ఒకే తల్లికి పుట్టిన బిడ్డలు కూడను ఒకరితోనొకరు జగడాలు వేసుకుంటున్నారు. ఈవిదంగా ఒకరినొకరు ద్వేషించుకోటానికి కారణమేమిటి? వారి వారి దుర్బుద్ధులే! ఆవిధమైన దుర్బుద్ధులను మనము నేర్చుకోకూడదు. ఇక్కడ మీరు మంచి కాలేజీలో చదువుతున్నారు. మీ మంచితనముతో ఈ కాలేజీ మంచిపేరును నిల్పుకోవాలి. మీకు 'మంచి పిల్లలు' అని పెరు రావాలంటే మీరు మంచివారితో స్నేహం చేయలి. Tell me your company, I shall tell tou what you are. మన 'కంపెనీ' ఎలాంటిదో అలాంటివారిగా తయారౌతాము. కాబట్టి, మన 'కంపెనీ'ని మంచిగా పెట్టుకోవాలి. అయితే, 'గుడ్ కంపెనీ' చిక్కటం చాలా అదృష్టం. మంచి కంపెనీలో చేరి మనము మంచి విషయాలనే అభివృద్ధిపరచుకుంటూ రావాలి. నిన్నటి దినం మన ఎం.బి.ఎ. పిల్లలు చాలా చక్కగా మాట్లాడారు. మాయ్లాడుతుంటే నాకెంతో ఆనందం వేసింది. ఇలాంటి 'గుడ్ బాయ్స్' మన కాలేజీలో వుండటం మనకెంతో ఆనందం. ఈ పిల్లలు ఎంతో చదివారు. అన్నింటియందు ఫస్టుక్లాసు సాధించారు, గోల్డుమెడల్ అందుకున్నారు. అయితే, కేవలం చదువులో ఫశ్టుక్లాసు సాధించినంత మాత్రమున మీరు తృప్తి పడకూడదు. మీరందరూ 'గుడ్‌బాయ్స్' కావాలి. బంగారానికైనా వెల తగ్గుతుందిగాని, మంచితనానికి ఏనాటికీ వెల తగ్గదు. కాబట్టి, మనం మంచితనాన్ని నేర్చుకోవాలి. అప్పుడే శాశ్వతమైన కీర్తిని గడిస్తాము.

మొట్టమొదట మనకు ఆత్మవిశ్వాసం కావాలి. ఆత్మవిశ్వాసం వున్నటువంటివారికి అంతా మంచే జరుగుతుంది. రాథ, ప్రహలదుడు, ధ్రువుడు ఇలాంటి వారంతా మంచి భావాలతో జీవించారు. కనుకనే, వారికంతా మంచే జరిగింది. దుర్మార్గుడైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని ఎన్నోవిధాలుగా హింసించాడు. ఏనుగులచేత త్రొక్కించాడు. ప్రహ్లాదుడు 'నారాయణ, నారాయణ' అని స్మరిస్తూనే వున్నాడు. ఆ ఏనుగులుకూడా అతనికి నారాయణగానే కనిపించాయి. విషసర్పములచేత కరిపించాడు. ప్రహ్లాదుడు 'నారాయణ, నారాయణవ అంటుంటే ఆ విషమంతా ఎక్కడికి పోయిందో! అంతేకాదు, హిరణ్యకశిపుడు అతనిని పర్వతములపైనుంచి క్రిందికి నెట్టించాడు. సముద్రంలో పడద్రోయించాడు. అప్పుడుకూడా నారాయణుడు ప్రహ్లాదుని రెండు చేతులతో పట్టుకొని క్షేమంగా ఇంటికి చేర్చాడు. ఈవిధంగా, భగవంతుని నమ్మినవానికి ఎప్పటికీ ఏనాటికీ ఎక్కడకూడను కీడు జరగదు. కనుక, మీరందరూ అటువంటి దృఢమైన విశ్వాసమును అభివృద్ధి చేసుకోవాలి. ఆ విశ్వాసమే మీకు అన్ని విద్యలను నేర్పుతుంది.

ఎక్కడ విశ్వాసమో అక్కడ ప్రేమ. ప్రేమ ఎక్కడో దైవమక్కడ. దైవానికి వేరే పేరు లేదు. రూపము లేదు. సత్యమే దైవము, దైవమే సత్యము. సత్యమే ఈ ప్రపంచమునంతా సృష్టించింది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె

సత్యంబు నందణగె సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య.

అదియే సాక్షాత్కారము. కనుకనే, సత్యాన్ని మనము గుర్తించాలి. కొంతమందికి దైవం పట్ల విశ్వాసం వుంటుంది కాని, కొద్ది దినాలలో అది మార్పు చెందుతుంది. విశ్వాసము మారుతుంటే ఫలితము కూడా మారుతుంటుంది. నీకు సంపూర్ణమైన విశ్వాసం వుంటే ఫలితముకూడా సంపూర్ణముగా, మంచిదిగా వుంటుంది. నీకు కొన్ని కష్టములు కలిగినప్పుడు ఆ ప్రేమను, విశ్వాసమును నీవు మరచిపోతావు. ఏమి జరిగినప్పటికీ విస్వాసమును కోల్పోకూడదు. విశ్వాసమే కోల్పోకూడదు. విశ్వాసమే మన శ్వాస కావాలి. అదే సరైన పద్ధతి. నీ తల్లిదండ్రులను టూపించి 'వీళ్ళు నీ తల్లిదండ్రులు కారు' అని ఎంతమంది ఎన్నివిధాలుగా చెప్పినప్పటికీ నీవు ఒప్పుకోవు. 'వాళ్ళు నా తల్లిదండ్రులే' అంటావు. అట్లే, భగవంతుని పట్ల నీ విశ్వాసముకూడా సంపూర్ణముగా వుండాలి. కష్టము జరగనీ, నష్టము జరగనీ, ఎట్టి స్థితిలోనైనా నీ విశ్వాసం నిశ్చలంగా వుండాలి. అంతటి దృఢమైన నమ్మకం కల్గినటువంటివానికి భగవంతుడు ఎంతైనా సహాయం చేస్తాడు.

తానీషా తనను చెరసాలలో పెట్టినప్పుడు రామదాసు, 'స్వామీ! నేను వసూలు చేసిన డబ్బంతా నీకే అర్పితం చేశాను కదా' అంటూ ఈ పాట పాడాడు.

లక్ష్మణునకు చేయిస్తి బంగారు మొలత్రాడు రామచంద్రా!
ఆ మొలత్రాటికి పట్టె పదివేల వరహాలు రామచంద్రా
సీతమ్మకు చేయిస్తే చింతాకు పతకము రామచంద్రా!
ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా!
కలికితురాయి నీకు కుదురుగ చేయిస్తి రామచంద్రా!
ఎవడబ్బ సొమ్మని కులుకుతు తిరిగెదవు! రామచంద్రా!

వెంటనే మనస్సులో పశ్చాత్తాపపడ్డాడు.

అబ్బ తిట్టితినని ఆయాసపడవద్దు రామచంద్రా!
ఈ దెబ్బలకోర్వక అబ్బా తిట్టితినయ్య రామచంద్రా!

'నీ పరీక్షకు తట్టుకోలేక నిన్ను తిట్టాను స్వామీ, నన్ను క్షమించు' అని కోరాడు. ఈవిధంగా క్షమాపణ కోరిన తక్షణమే ఇరువురు పిల్లలు (రామలక్ష్మణులు) రెండు బంగారు కాసుల మూటలు తీసుకొని తానీషా వద్దకు వెళ్ళారు. అవి అతనికిచ్చి, 'మ్మల్ని రామదాసు పంపించాడు' అని చెప్పారు. రామదాసుకు ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది అని తానీషా ఆశ్చర్యపోయి రామదాసును పిలిపించాడు. 'ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది?' అని అడిగాడు. 'రాజా! ఇది నేను పంపిన డబ్బు కాదు. ఈ పని రాముడే చేశాడు' అని చెప్పాడు రామదాసు. ఈవిధంగా, భగవదనుగ్రహంతో ఏమైనా చేయవచ్చును. కనుక, మీరు ఏ పరీక్ష వచ్చినప్పటికీ దైవాన్ని నమ్మి పనిచేయండి. మీరు తప్పక ఆ పరీక్షలో ఉత్తీర్ణులౌతారు. విదేశీయులు ఎంత విశ్వాసము కలిగి ఉన్నారో తెలుసా? అనేకమంది పుట్టపర్తి గ్రామంలో చిన్నచిన్న గదుల్లో ఎంతో ఆనందంగా వుంటున్నారు. వారి ఆనందాన్ని వర్ణించటానికి వీలుకాదు. వారి విశ్వాసము అంథ గొప్పది. అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని మీరు పెట్టుకుంటే, ఎక్కడున్నా దైవము మీకు సహాయం చేస్తాడు.

అడవులందున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేటబడియున్న
దిక్కులేనివారికి దిక్కు దేవుడేను.

కనుక, మొట్టమొదట దైవవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఇది లేకుండా కేవలం నాలెడ్జిని పెంచుకుంటే ప్రయోజనం లేదు. సముద్రాలంత నాలెడ్జిని పెంచుకున్నావు. హిమాలయ పర్వతాలంతటి కామన్‌సెన్సను పెంచుకున్నావు. కాని, ఎన్ని వుండినప్పటికీ డిస్క్రిమినేషన్ లేకపోతే అంతా వ్యర్థమే! 'ఇది మంచిదా, చెడ్డదా? ఈ పని చేయతగినదా, చేయతగనిదా? అన్న డిస్క్రిమినేషన్ ఒక్కటి వుంటే చాలు, నీవు ఎంతైనా బాగుపడతావు. ఆ డిస్క్రిమినేషన్‌లోనే సెల్ఫ్ రియలైజేషన్ యిమిడి వుంది. కనుక, మొట్టమొదట డిస్క్రిమినేషన్‌ను నీవు సరైన రీతిలో పెట్టుకోవాలి. ఒకే విషయాన్ని పదిమంది పదిరకములుగా డిస్క్రిమినేట్ చేస్తారు. అది individual discrimination అనగా స్వార్థ స్వప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని చేసేది. మనము స్వప్రయోజనాన్ని కాదు, సమాజ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అదే fundamental discrimination అదే మనకు self satisfaction యిస్తుంది. ఆ ఆత్మతృప్తియే ఆత్మసాక్షాత్కారినికి దారితీస్తుంది. కనుక, ఆత్మసాక్షాత్కారానికి fundamental discrimination చాలా ముఖ్యం.

పిల్లలారా! మీరు చక్కని బంగారమువంటి పిల్లలు. కాని, మధ్యమధ్య కొన్ని అలలు, తెరలుగా నెగిటివ్ థాట్స్ వస్తున్నాయి. కాని, వచ్చినవి పోతుంటాయి. దానికి మనం ఏమాత్రం చలించకూడదు. ఎన్ని వచ్చినప్పటికీ వెరువకుండా నిశ్చలంగా వుండాలి. మన స్టడీ

అనేది స్టెడీగా వుండేటట్లు చేయాలి. Study to be steady దీనిని మీరు మనస్సులో భద్రము చేసుకోవాలి. ఆ ఇద్దరు పిల్లలు ఎంత ఆనందంగా వున్నారు! ఎమ్.బి.ఎ. పిల్లలు అందరూ మంచివారే. ఒకరు మంచి, ఒకరు చెడ్డ అని చెప్పటానికి వీలులేదు. వారి గానము కూడను ఎంతో చక్కగా, శ్రవణానందముగా వుండినది. వారు చక్కని గుణవంతులు, బలవంతులు, బుద్ధిమంతులు. ఎక్కడ పోయినప్పటికీ వారి విలువ వారివెంటనే వుంటుంది. మన కాలేజీలో అట్టి పిల్లలు తయారు కావాలి. వారు మన కాలేజీలో నిల్చిపోయి మిగతా పిల్లల్ని ఆవిధంగా అభివృద్ధి చేయాలి. ఏదో గొప్ప చదువులు చదివినామని విదేశాలకు పోయి దండిగా డబ్బు సంపాదించటం గొప్పతనము కాదు. Money comes and goes, morality comes and grows. అట్టి మొరాలిటీని సంపాదించుకోవాలి. మొరాలిటీ ఒక్కటుంటే చాలు. ధనమే వస్తుంది మనకు. కరెన్సీ నోట్లు తింటావా! కనుక, కరెన్సీ కాదు మనకు ముఖ్యము. డిస్క్రిమునేషన్ చాలా అవసరము. మొరాలిటీ చాలా అవసరము. మొట్టమొదట దైవవిశ్వాసము, తరువాత ఉద్యోగము. పవిత్రమైన మన భారతీయ సంస్కృతిని మీరు వదలిపెట్టకుండా అనుసరించాలి. దేశాభిమానమును ఏమాత్రం మరువకూడదు. దేశాభిమానము వుంటే ఎంతైనా మనము సాధించవచ్చు. సుభాష్‌చంద్రబోస్ విదేశాలకు పోయినప్పటికీ మాతృభూమిని ఏమాత్రమూ విస్మరించలేదు. 'ఇది నా మాతృదేశము' అని విద్యార్థులందరూ సగర్వంగా చాటాలి. దేశాన్ని మరువకుండా వుండాలి. మన దేశ సంస్కృతిని మనము ఏమాత్రము పాడుచేయకూడదు. ఆ సంస్కృతియే మనకు అన్నివిధాలుగా సహాయం చేస్తుంది. ***be happy.***